TGTEL/26/A7716
ఉద్యమ పోరు
UDYAMA PORU
ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 24 | శుక్రవారం | 09.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

క్యాన్సర్ మందుల ధరలకు కేంద్రం కళ్లెం.. 70 శాతం వరకు తగ్గే ఛాన్స్

- క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్ 30 శాతానికి పరిమితం
- కొన్ని మందుల ధరలు 70 శాతం వరకు తగ్గే అవకాశం
- రోగులకు ఏటా రూ.2,500 కోట్ల వరకు ఆదా అంచనా
- బ్రాండెడ్, జనరిక్ మందులకూ వర్తింపు

2

తెలంగాణలో మండుతున్న ఎండలు.. పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

- తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత
- ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

2

పండగ వేళ గుడ్‌న్యూస్.. యూపీఐ ఛార్జీలు జనవరికి వాయిదా?

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీల అమలు వాయిదా పడే అవకాశం
- పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకునే యోచన
- వినియోగదారులకు భారం ఉండదు, ఇది కేవలం మర్చంట్ ఛార్జీ అంటున్న కేంద్రం

2

ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ

దేశాన్ని రెండుగా విభజించారు

- సీఎం రేవంత్ రెడ్డి

- ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్

ఉద్యమ పోరు, హైదరాబాద్ : ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి భాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది"అని ఆయన పేర్కొన్నారు.....

2

'సర్' వివాదంలో కీలక పరిణామం
42 మంది మాజీ జడ్జీల సంచలన లేఖ

- ఈసీని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన
- ఆధారాలు లేకుండా 'ఓట్ల చోరీ' ఆరోపణలు చేయొద్దంటూ అభ్యంతరం
- 'సర్' చట్టబద్ధమైన ప్రక్రియ అని మాజీ జడ్జీల మద్దతు

2

జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు.. 14 మందిపై కేసు నమోదు

- వనపర్తి జిల్లాలో 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు
- జూరాల కాలువకు బలవంతంగా నీళ్లు విడుదల చేయడమే ఇందుకు కారణం
- పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు
- ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై

2

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే వీడియో వివాదం..
షేర్ చేసిన వారిపై కేసు

- విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించారని ఎమ్మెల్యే రంగారెడ్డిపై ఆరోపణలు
- బస్సు మలుపు తిరుగుతుండగా పొరపాటున చేయి తగిలిందని యూత్ కాంగ్రెస్ వివరణ
- ఇది బీఆర్ఎస్ కుట్ర అంటూ యూత్ కాంగ్రెస్ నేత పోలీసులకు ఫిర్యాదు

2

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు : మహేశ్ గౌడ్

- మోదీ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర ఆరోపణలు
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించాయని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం

2

జర్నలిస్ట్ రేఖకు కేటీఆర్ భరోసా

- విచారణ పేరుతో వేధించడంపై ఆగ్రహం
- న్యాయ సహాయం చేస్తామని హామీ

ఉద్యమ పోరు, హైదరాబాద్ : పోలీసుల వేధింపులకు గురైన జర్నలిస్ట్ రేఖకు బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. గురువారం రేఖకు ఫోన్ చే సి జరిగిన పరిణామాలను తెలుసుకుని ధై ర్యం చెప్పారు. చంటిపాపతో ఉన్న ఆమెను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి 8 గంటల పాటు విచారణ చేయడంపై ఆగ్రహం వ్య క్తంచేశారు. రేఖ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న స మయంలో రాత్రి 12గంటల వరకు పార్టీ నాయకులు, మహిళా నేతలు, లీగల్ టీ మ్‌తో మాట్లాడి అవసరమైన న్యాయసహా యం అందించాలని సూచించారు. ఈ మేరకు నాయకులు, మహిళా నేతలు రేఖ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 087.10.2026

బండి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

నేటి శుభోదయ, హైదరాబాద్ : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి మీడియా, సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రసారాలను తక్షణమే నిలిపివేయాలని న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు కేసులో తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఆ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ భగీరథ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని, ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించి, డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని ఆయన కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి కంటెంట్‌ను ప్రసారం చేయవద్దని టీవీ ఛానెళ్లు, ప్రైవేట్ వ్యక్తులు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ఆదేశించింది. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ సంస్థలు సంబంధిత కంటెంట్‌ను తక్షణమే తొలగించి, డిజిటల్ రికార్డులను భద్రపరచాలని సూచించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖలు, తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, సోషల్ మీడియా సంస్థలతో పాటు పలువురు ప్రైవేట్ వ్యక్తులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు..
14 మందిపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి.. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంత కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు
- మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తెలంగాణలో మండుతున్న ఎండలు..
పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ
SIR తో దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు : రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే వీడియో వివాదం.. షేర్ చేసిన వారిపై కేసు

మొదటిపేజీ తరువాయి.. బస్సులో ఒక విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై వస్తున్న ఆరోపణలు నేపథ్యంలో, ఆ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఈ వీడియోను ప్రచారం చేస్తున్నారంటూ ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. సికిందర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అక్టోబర్ 6వ తేదీన ఔటర్ రింగ్ రోడ్డులో ప్రయాణిస్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా ఆయన ఒక కళాశాల విద్యార్థినితో మాట్లాడారు. ఈ పథకం ద్వారా తనకు ఏడాదికి సుమారు రూ. 45,000 ఆదా అవుతున్నాయని ఆమె ఎమ్మెల్యేకు వివరించారు. అయితే, ఈ సంభాషణ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే సదరు విద్యార్థినిని తాకడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవ్వడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మాత్రమే ఎమ్మెల్యే చేయి ఆ యువతికి తగిలిందని, కానీ బీఆర్ఎస్ నాయకులు దీనిని ఉద్దేశపూర్వకంగా తప్పుడు కోణంలో చిత్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ కుట్ర పన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సికిందర్ రెడ్డి ఫిర్యాదు ఆధారంగా, పరువు నష్టం కలిగించే ఉద్దేశంతో దుష్ప్రచారం చేయడం, ఫోర్జరీ, పబ్లిక్ మిస్చీఫ్ వంటి అభియోగాలతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67 కింద వీడియోను షేర్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'సర్' వివాదంలో కీలక పరిణామం..
42 మంది మాజీ జడ్జీల సంచలన లేఖ

మొదటిపేజీ తరువాయి.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ 42 మంది మాజీ న్యాయమూర్తులు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సంఘం (ఈసీఐ), న్యాయవ్యవస్థ సహా రాజ్యాంగ సంస్థలను బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా 'ఓట్ల చోరీ' అంటూ ఆరోపణలు చేయడంపై మాజీ న్యాయమూర్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలను పదేపదే 'దొంగలు', 'లోపభూయిష్టమైనవి' అంటూ ముద్ర వేయడం ప్రజల్లో విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. 'సంస్థలను విమర్శించడం ప్రజాస్వామ్యంలో హక్కు. కానీ వాటిని కించపరచడం మాత్రం కాదు' అని లేఖలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి విశ్వాసమే కీలకమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేసేందుకు చేపట్టిన చట్టబద్ధమైన ప్రక్రియ 'సర్' అని మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఎన్నికలపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు అశాంతికి దారితీయొచ్చని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు అరాచక శక్తులకు ఊతమివ్వొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ పంకజ్ మిట్టల్ సహా పలువురు ఈ లేఖపై సంతకం చేశారు. జమ్మూ కశ్మీర్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీసీ పటేల్, కర్ణాటక హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభ్రో కమల్ ముఖర్జీ, సిక్కిం హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ కూడా సంతకం చేసిన వారిలో ఉన్నారు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పందించారు. ఎన్నికల సంఘం నిర్వహించిన ఎన్నికల్లో గెలిచిన స్థానాలకు ప్రతిపక్ష నేతలు రాజీనామా చేయాలని సవాల్ చేశారు. ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తూ ప్రజల్లో విషం నింపే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

క్యాన్సర్ మందుల ధరలకు కేంద్రం కళ్లెం..
70 శాతం వరకు తగ్గే ఛాన్స్

మొదటిపేజీ తరువాయి.. క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని అన్ని క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసింది. ఈ నిర్ణయంతో కొన్ని మందుల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ నిర్ణయం బ్రాండెడ్, జనరిక్ మందులతో పాటు దేశీయ, దిగుమతి మందులకూ వర్తిస్తుంది. పేటెంట్ ఉన్నవి, లేనివి కూడా ఇందులోకి వస్తాయి. మందుల సరఫరా వ్యవస్థలో అధిక లాభాలను నియంత్రించడంతో పాటు క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది. క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 29న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం కీలక ప్రశ్నలు వేసింది. ఓ క్యాన్సర్ మందును రిటైలర్లకు సుమారు రూ.2,700కు సరఫరా చేస్తుండగా.. దాని ఎంఆర్‌పీ రూ.27,000గా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. మందులపై ఒకే విధమైన మార్జిన్‌ను నిర్ణయించలేమా అని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పథకాల కింద చికిత్స పొందుతున్న వారికి ఆసుపత్రుల్లోని సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలని చెప్పడంపైనా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అక్టోబర్ 12న మరోసారి విచారణ జరగనుంది. ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ఇదే తొలిసారి కాదు. 2019లో 42 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) 30 శాతం మార్జిన్‌ను అమలు చేసింది. దీంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున 50 శాతం తగ్గాయని కేంద్రం తెలిపింది. అప్పట్లో రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా అయినట్లు అంచనా. తాజా నిర్ణయంతో కొన్ని మందుల ధరలు 70 శాతం వరకు తగ్గొచ్చని కేంద్రం చెబుతోంది. 2026 మార్చి నాటికి 131 క్యాన్సర్ మందులకు ఎన్‌పీపీఏ ధర పరిమితులు అమల్లో ఉన్నాయి. జన ఔషధి వంటి పథకాలు, కస్టమ్స్ సుంకాల తగ్గింపుతోనూ క్యాన్సర్ చికిత్స ఖర్చును తగ్గించే చర్యలు కొనసాగుతున్నాయి.

పండగ వేళ గుడ్‌న్యూస్.. యూపీఐ ఛార్జీలు జనవరికి వాయిదా?

మొదటిపేజీ తరువాయి.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే భారీ విలువ గల లావాదేవీలపై ప్రతిపాదించిన రుసుము అమలును కొన్ని నెలల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో ప్రారంభం కానున్న పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుమును అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రతిపాదించింది. అయితే, ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నిర్ణయం వల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరకడమే కాకుండా, పండగ సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుందని అంచనా. ఆరేళ్లకు పైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారుల వైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకు పైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 నెలలోనే యూపీఐ ద్వారా రూ. 29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే, అది దసరా, దీపావళి వంటి పండగల సమయంలో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో, ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభిస్తుంది.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 08.10.2026

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

- రాష్ట్ర డిజిపి సివి ఆనంద్

ఉద్యమపోరు, హైదరాబాద్, అక్టోబర్ 08 : జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని, వైఫల్యాలను వెక్కిరించి అఘాయిత్యాల ఆలోచనను మానుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన మనిషి పరిపూర్ణుడు అవుతాడని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పోలీస్ సివి ఆనంద్ పిలుపునిచ్చారు.గురువారం నాడు రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ గత సంవత్సర కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో చేపట్టిన ఆత్మహత్యల నివారణ సదస్సుల సర్వే రిపోర్టు ను కమిటీ చైర్మన్ డాక్టర్ పరికి పండ్ల అశోక్ డిజిపి కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా పోలీసు వారి కుటుంబాలకు ఆత్మహత్యల నివారణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమని ఇకముందు కూడా మిగిలిన జిల్లాల్లో కొనసాగించాలని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పరికిపండ్ల అశోకు రచించిన నిలిచి గెలిస్తేనే ఘనత పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ & సైకాలజిస్ట్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే, అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా

నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ హత్యల నివారణ కమిటీ సభ్యులు సుంకనపల్లి రాజేందర్, డాక్టర్ నోముల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మకు హాజరై నివాళులు అర్పించిన

పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి

ఉద్యమపోరు, నెక్కొండ, అక్టోబర్ 08 : నెక్కొండ మండలం పత్తిపాక వాస్తవ్యులు పసునూటి సురేష్ సతీష్ గార్ల తండ్రి గారైన పసునూటి విరస్వామి గారి దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలేసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించిన పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి గారు నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి గారు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ గారు మండలఅధ్యక్షులు లావుడ్యా తిరుమల్ రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గై లక్ష్మన్ పత్తిపాక సర్పంచ్ లావుడ్యా సామ్య నాయక్ బొల్లెబోయిన సురేష్ వార్డ్ సభ్యులు వినోద్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

రానున్న వరంగల్ - ఖమ్మం- నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 08 : వరంగల్ – ఖమ్మం – నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకట్ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర రైతు సమన్వయ సమితి డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు – ఎన్నికల సన్నద్దత పై దిశా నిర్దేశం ఇస్తూ... అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఫారం-18 ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను అర్హులైన పట్టభద్రులకు వివరించి, ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు ఇప్పుడు మళ్ళీ నమోదు చేసుకోవాలి ఒక్క అర్హుడైన పట్టభద్రుడు కూడా ఓటరు జాబితాలో నమోదు కాకుండా మిగల కూడదనే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి నర్సంపేట మున్సిపాలిటి 30 వార్డులలో

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బాధ్యులకు సూచించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టి లో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణు లు మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, ఎన్నికల సన్నద్ధతను మరింత పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మునిగాల వెంకట్ రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, నామాల సత్య నారాయణ, గోనె యువరాజు, మండల శ్రీనివాస్, రాయుడి దుష్యంత్ రెడ్డి బుస కృష్ణంరాజు, దొమ్మటి సంతోష్, నాగిశెట్టి ప్రసాద్, శీలం రాంబాబు, గందె చంద్రమౌళి, వాసం కరుణ, కందికొండ సంధ్య, చింతం విజయ రాణి, వడ్లకొండ స్వరూప పెండెం వెంకటేశ్వర్లు, బీరం నాగిరెడ్డి తాళ్ల పెల్లి రాంప్రసాద్, కడారి కుమార్, పాలడుగుల రమేష్ , గోనెల కర్ణాకర్, శరత్, ఎస్ కే ఇర్ఫాన్, కమల్, గాదె ఇసాక్, సుధాకర్ లాల్, గాలి శ్రీనివాస్, ఆబోతు రాజు యాదవ్, బాల్నే సుభాష్, నాయిని వేణు, పల్నాటి సందీప్, సంపంగి సాలయ్య, పైసా ప్రవీణ్, గుండెబోయిన శివకోటి, నాడెం సాంబయ్య రిటైర్డ్ టీచర్, నీరటి రంజిత్, నాగేల్లి అరవింద్, ఎదరబోయిన నవీన్, గారే శ్రీకాంత్, నాగెల్లి శివరాం ,తాబేటి రాజేందర్, మండల సంతోష్ పట్టణ ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ములుగు జిల్లాలో లారీ బీభత్సం

CRPF జవానుల డీసీఎంను ఢీకొట్టి.. ఆగకుండా మరో కారును ఢీకొట్టిన ఇసుక లారీ

ఉద్యమపోరు, ఇములుగు, అక్టోబర్ 08 : పస్ర ఫారెస్ట్ టోల్‌గేట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. CRPF జవానులు ప్రయాణిస్తున్న డీసీఎంను ఇసుక లారీ ఢీకొట్టినట్లు సమాచారం .డీసీఎంను ఢీకొన్న అనంతరం లారీ ఆగకుండా అతివేగంగా వెళ్లి మరో కారును ఢీకొట్టినట్లు తెలుస్తోంది.ఈ ప్రమాదంలో డీసీఎం లో ప్రయాణిస్తున్న ఇద్దరు CRPF జవాన్లు మృతి చెందినట్లు సమాచారం. మరోవైపు లారీ ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో చిక్కుకున్న రెవెన్యూ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నాం

- రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఉద్యమపోరు, దిండి(గుండ్లపల్లి), అక్టోబర్ 07 : గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని అన్ని వార్డులలో మున్సిపల్ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని అన్నారు. గత బిఆర్ఎస్ పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందన్నారు.

ఉప సర్పంచ్ లపై ఒత్తిడి సహించలేనిది

- తెలంగాణ శ్రీనివాస్ నాయక్

ఉద్యమపోరు, నెక్కొండ, అక్టోబర్ 08 : తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ లను చెక్కుల సంతకాల విషయంపై ఏడు రోజుల గడువిధిస్తూ ఒత్తిడి చేయడం సహించరానిదని ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు , సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత తెలంగాణ శ్రీనివాస్ నాయక్ అన్నారు ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు దండా నరేష్ ఇటీవల జ్వరంతో బాధపడుతుండగా ఈ విషయం తెలుసుకొని వారిని ప్రత్యక్షంగా పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకొని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రివర్యులు ఎంతనో... యావత్ తెలంగాణ గ్రామ, గూడెం, తండా పంచాయతీలలో ఉన్న ఉప సర్పంచ్లు కూడా మా స్థాయిని బట్టి మేము కూడా అంతేనని, ప్రతి అభ్యర్థి గెలుపుకై ఒక ఓటు ప్రచారం మాత్రమే... కానీ సర్పంచ్ ల గెలుపుతో పాటు మా గెలుపు చూస్తే అంతరాత్మకు అర్థమవుతుందని ఈ విషయం సర్పంచులు తెలిసి కూడా ఆత్మసాక్షికి విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు.... సర్పంచ్, కార్యదర్శి, ఎం పి ఓ తదితరులు కుమ్మక్కైన కూడా తప్పుడు బిల్లుపై సంతకాలు చేస్తే చూస్తూ ఉపసర్పంచ్ లకు చేతకాదు అనుకోవడం తప్పిదమని, అయినా ఏడు రోజుల్లో సంతకాలు పెట్టాలి లేని పక్షంలో మేం పెట్టుకుంటాం... మేం చేసుకుంటాం... చూసుకుంటాం... తగ్గేది లేదు అనే విధంగా వ్యవహరిస్తే హాస్యస్పదంగా ఉందని ఉప సర్పంచ్ ల దగ్గరికి చెక్కు రాకుండానే ఏడు రోజుల తర్వాత పిట్ట కథ,హరికథ,బుర్రకథ చెప్పి ఉపసర్పంచులను బదనాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు... అయినా గ్రామ అభివృద్ధిలో మేము భాగస్తులై ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ వ్యవహరిస్తామని అలాగే తప్పుడు బిల్లులపై నిలదీస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తామని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హెచ్చరిస్తూ ఉపసర్పంచ్ ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు

భూగర్భ జలాలను సంరక్షిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేయాలి

- ఎల్‌నినో పరిస్థితుల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

ఉద్యమపోరు, వరంగల్, అక్టోబర్ 08 : ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, జిల్లాలో ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని అన్నారు. సుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటల వైపు వెళ్లకుండా, నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై రైతులకు సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

టిబి ముక్త్ భారత్ కోసం యువత చురుకుగా భాగస్వాములు కావాలి

- ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

ఉద్యమపోరు, వరంగల్, అక్టోబర్ 08 : టిబి ముక్త్ భారత్ సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకుగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. టిబినిర్మూలనలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత కేసులను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని సూచించారు.వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'టిబి ముక్త్ భారత్ – ఆయుష్మాన్ కోసం జోష్ టీములు' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూక్షయ వ్యాధి బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి అని, ప్రధానంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందని టిబి రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి కఫ పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకోవాలని తెలిపారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని పేర్కొన్నారు.

డ్రగ్ రెసిస్టెంట్ టిబిపై అప్రమత్తత అవసరం

డ్రగ్ రెసిస్టెంట్ టిబి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మందులను సక్రమంగా, నిర్దేశించిన కాలం పాటు తీసుకోకపోతే ఔషధ నిరోధకత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డ్రగ్ రెసిస్టెంట్ టిబి ఉన్నవారు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ చికిత్సను పూర్తి చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో టిబిపై అవగాహన కల్పించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడం, అవసరమైన పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చూడాలని సూచించారు.ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత, ప్రభావశీల వ్యక్తుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యశాఖతో పాటు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు

టిబి రహిత గ్రామాల సర్పంచులకు సన్మానం

టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించబడిన గ్రామాల సర్పంచులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సన్మానించారు. శాలువాలతో సత్కరించి టిబి ముక్త్ భారత్ గ్రామాల సర్టిఫికెట్లను అందజేశారు.చాపలబండ గ్రామ సర్పంచ్ ఆలేటి పశు, దేశాయిపల్లి సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి , చెన్నారం సర్పంచ్ సింధం లలిత, కాశిగూడెం సర్పంచ్ పటాన్ రాజాక్, లోహిత గ్రామ సర్పంచ్ బొమ్మ నాగేష్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్క అనిత తరపున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్ అందుకున్నారు.

అనంతరం టిబి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా రాణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ. ప్రకాష్, డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ అరుణ్ జోషి, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, టిబి రహిత గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ కమాండర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు, టిబి విభాగ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆగమనం పోస్టర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 08 : నర్సంపేటలో శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆగమనం పోస్టర్‌ను బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. దేవి నవరాత్రులు భక్తి, శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించుకోవాలని, యువత ఉత్సవాల నిర్వహణలో ముందుండి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కనకదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : ఈ నెల 12వ తేదీన ఖమ్మం నగరం అల్లిపురం, కొత్తగూడెం సమీపంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో శంకుస్థాపన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్‌తో కలిసి స్వయంగా పరిశీలించారు.శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే అతిథులు, భక్తులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నున్నా మాధవరావు కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : ఖమ్మం గ్రేయిన్ మార్కెట్ ట్రాలీ యూనియన్ అధ్యక్షులు నున్నా మాధవరావు ఇటీవల గుండెపోటుతో పరమపదించారు.గురువారం వారి దశదిన ఖర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలి

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : భవిష్యత్ లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతి భూమికి భూదార్ నెంబర్ తో పాటు రైతుల భూముల సరిహద్దులు, విస్తీర్ణాన్ని స్పష్టమైన మ్యాప్ తో రీసర్వే చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు.గురువారం సత్తుపల్లి నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. కల్లూరు మండలం రఘునాథ్ గూడెం, రఘునాథ్ బంజర గ్రామాలలో రైతుల సమక్షంలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పొలం గట్టపై రైతులతో కలెక్టర్ ముచ్చటించి, రీ సర్వే పై వారి అభిప్రాయాలను తెలుసుకొని, రైతులు అడిగిన పలు సందేహాలకు వివరణ ఇస్తూ వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ మాట్లాడుతూ దాదాపు వందేళ్ల తర్వాత ప్రభుత్వం రైతుల సమక్షంలో పారదర్శకంగా భూముల రీసర్వే చేపడుతోందన్నారు. ప్రతి భూమికి భూధార్ నంబర్ కేటాయించి, ఎల్పీఎం ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతులకు పాస్‌బుక్‌లో మ్యాప్ తో కలిపి అందిస్తామని తెలిపారు. భూముల సరిహద్దులు, రికార్డులు, విస్తీర్ణంలో ఉన్న తేడాలను పరిశీలించి చుట్టూ ప్రక్కల రైతుల సంతకాలతో పంచనామా చేసి నమోదు చేస్తామని చెప్పారు. రీసర్వే ద్వారా ఎవరి భూమిని తగ్గించడం లేదా పెంచడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, క్షేత్రస్థాయిలో భూమే ప్రమాణంగా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.రైతులు సర్వేయర్లు అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా అందుబాటులో ఉండి తమ భూముల సరిహద్దులను చూపించాలని కలెక్టర్ కోరారు. ప్రతి సర్వే నంబర్‌కు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సర్వే తేదీలను రైతులకు ముందుగానే తెలియజేసి, నోటీసులు అందిస్తామని అన్నారు. రీసర్వే అనంతరం రైతుల సమక్షంలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, నమోదైన వివరాలను అక్కడికక్కడే వివరిస్తామని, రైతులకు సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే రైతుల కోరికమేరకు మరలా కూడా రీ సర్వే చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మండల తహసీల్దార్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో అంగన్వాడీ కేంద్రాలకు భారీగా నిధులు

ఉద్యమపోరు, హఫీజ్ పెట్, అక్టోబర్ 8 : హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో, యూత్ కాలనీ, హఫీజ్ పేట్ గ్రామం అంగన్వాడీ,కేంద్రంలో,"అంగన్ మిలన్ సేవా" కార్యక్రమం నిర్వహించడం జరిగింది,అంగన్వాడీ కేంద్రన్నీ సందర్శించి కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ గురించి చర్చించి, అనంతరం అంగన్వాడీ సిబ్బందిని, గర్భిణులను శాలువాతో సత్కరించి, పిల్లలకు పండ్లు,బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా,హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ,జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బోయిని అనూష మహేష్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి మాణిక్ రావు మాట్లాడుతూ. కేంద్రంలోని ప్రభుత్వం, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో అంగన్వాడీ కేంద్రాలకు భారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుంది,మహిళలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు, పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో ఐసిడిఎస్ అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు, పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు,ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మేరీ ,శ్రీధర్ రావు, బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు ప్రభాకర్ ,బీజేపీ హఫీజ్ పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్ , బీజేపీ నాయకురాలు పావని కుమారి ,బీజేపీ నాయకులు నవీన్ కుమార్ ,మనోజ్ యాదవ్, హర్షిత్ , రాజశేఖర్ ,లోకేష్ ఐసిడిఎస్ సిబ్బంది,అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పితృపక్షాల సందర్భంగా గజ్వేల్‌లో ఘనంగా అన్నదానం

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 08 :
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద గురువారం పితృపక్షాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంగిశెట్టి వెంకటేశం, బాలయ్య, ఆంజనేయులు, ఉమేష్, భాస్కర్, సంతోష్ తదితర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దానాలన్నింటిలో అన్నదానం మహాదానమని అన్నారు. పితృపక్షాలు (మహాలయ పక్షాలు) పురస్కరించుకుని గజ్వేల్‌లో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. పితృదేవతలను స్మరించుకుంటూ అన్నదానం చేయడం ద్వారా సమాజంలో సేవాభావం మరింత పెంపొందుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు గంగిశెట్టి వెంకటేశం అన్నదమ్ములు మాట్లాడుతూ తమ కుటుంబ పెద్దల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ కుటుంబంపై ఉండాలనే సంకల్పంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పితృపక్షాల సందర్భంగా అమావాస్య అన్న ప్రసాద సేవా సమితి, వాసవి సేవా సమితి సౌజన్యంతో, ఆర్యవైశ్య మహాసభ మరియు వాసవి క్లబ్స్ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో తమ కుటుంబ పెద్దలు వీరమల్లయ్య, పావమ్మ, కాశయ్య, సత్యలక్ష్మి , రాజేశం, పోషమ్మ, భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి మణికంఠ, అత్తిలి లక్ష్మయ్య, శ్రీనివాస్, జగ్గయ్యగారి శేఖర్, తాటిపల్లి

రమేష్, ట్రాఫిక్ పోలీసు సాంబశివరావు, కాసం లక్ష్మయ్య, దొంతుల సత్యనారాయణ, కాశీనాథ్, సిరిపురం సత్యనారాయణ, గందే యాదగిరి, సంతోష్, బిక్షపతి, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- **మాదారం, నర్సంపల్లిలో పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

ఉద్యమపోరు, మేడ్చల్–మల్కాజిగిరి, అక్టోబర్ 8 :
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అధికారులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా గురువారం ఘట్‌కేసర్ మండలం మాదారం, కీసర మండలం నర్సంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా మండలాల తహసీల్దార్లు భూ రీ సర్వే ప్రక్రియ, భూముల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని అదనపు కలెక్టర్‌కు వివరించారు. పాస్‌బుక్‌లో నమోదైన భూ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి ఉన్న ప్రదేశాన్ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అనంతరం సర్వే జరుగుతున్న తీరును అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.భూ రీ సర్వేలో పాల్గొంటున్న రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు. సర్వే సమయంలో రైతుల నుంచి అవసరమైన సమాచారం సేకరించి, భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సర్వేయర్లకు సూచించారు. భూ రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూ వివరాల నమోదు, భూమి స్థానాన్ని గుర్తించడం, సంబంధిత రికార్డులతో క్షేత్రస్థాయి వివరాలను

సరిపోల్చడం వంటి అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు సర్వే ప్రక్రియపై అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, కీసర తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై చేసిన ప్రచారం తప్పు

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం అక్టోబర్ 8
మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంచాల మండలం మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సుప్రయాణం ఎలాఉందో తెలుసుకోవడానికి బస్సులో ప్రయాణం చేస్తూ మ హిళల దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత ప్రయాణ సౌకర్యం ఎలాఉంది అని తెలు సుకునే సమయంలో బిడ్డలాంటి ఓఅమ్మాయి చెయ్యిపట్టు కొని ఉచిత ప్రయాణం ఎలా ఉంద మ్మా అని అడిగి తెలుసుకున్నారు దాన్ని కొంతమంది బిఅర్ పార్టీ.పోకిరీలు వీడియోతీసితప్పు గా వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేయడం సిగ్గుచేటు సరైన పద్ధతి కాదు అని అన్నారు. ఆడపిల్ల అంటే అమ్మతో సమానం హిందూధర్మంలో మహిళని మహాలక్ష్మి లపూజి స్తాం మీకుటుంబాల్లో ఆడపిల్లలు లేరా మీఆడపిల్లల్ని చెయ్యి పట్టుకొని ఆప్యాయంగా ముచ్చటిస్తే మేము ఇలాగానే ప్రచారం చేయాలా అని బిఆర్ఎస్ పార్టీ నాయకులను మీడియా ద్వారా ప్రశ్నించారు.ఏనాయకుడైనా రాజకీయంగా విమర్శలు చేసేటప్పుడు నిజానిజాలు తెలుసుకొనిమా ట్లాడాలి అని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆడపిల్లలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆ వేదన వ్యక్తం చేశారు. ఆడది అంటే మీకు ఆట బొమ్మలాగా కనిపిస్తుందా కండ్లకు ఎన్నికల సమ యంలో ప్రతిరాజకీయనాయకుడు మహిళలను ఆప్యాయంగా పట్టుకొని భుజంపై చెయ్యివేసి మరి ప్రచారం చేస్తారు.అలాంటప్పుడు రాని చెడుఆలోచన ఇప్పుడే వస్తుందా ఇది కేవలం కావాలని కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్ రెడ్డి రంగారెడ్డిని బాదలం చేయడానికి అని అన్నారు. ఎవ్వరు ఎన్నిప్రచారాలు చేసిన మాప్రియతమా నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నిప్పు నిజాయితీగల ఒక గొప్ప నాయకుడు మారంగన్న అని అన్నారుఇబ్ర హీంపట్నం నియోజకవర్గంలో మల్ రెడ్డి రంగారెడ్డి గారు అన్నిగ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అని మండి పడ్డారు రాజకీయకంగా ఎలాంటి విమర్శలు అయినా చేసుకోవచ్చు ప్రచారాలు చేసుకోవచ్చు కానీ ఒక ఆడపిల్లను అడ్డం పెట్టుకొని టిఆర్ఎస్ నాయకులు చేసిన పెద్ద తప్పు అని అన్నారు రాబోయే రోజుల్లో నియోజకవర్గం మహిళలే బిఆర్ఎస్ పార్టీ నాయకులకు సరైన బుద్ధి చెప్తారు అని అన్నారు ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పైన తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలి లేనిపక్షంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహి ళలతో కలిసి పెద్దఎత్తున బిఆర్ఎస్ పార్టీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పుతాం అని హెచ్చ రించారు.

స్వపక్షంలోనే విపక్షంలా ఖమ్మం బీఆర్ఎస్

- తారా స్థాయికి చేరిన విభేదాలు
- తాతా మధు–పువ్వాడ అజయ్ మధ్య గ్యాప్
- అయోమయంలో కేడర్
- ఎదురుపడినా ఎవరికి వారే..
- వర్గ రాజకీయాలపై పార్టీ శ్రేణుల్లో ఆందోళన

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న రాజకీయ దూరం తాజాగా బహిరంగంగా కనిపిస్తోందనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. అధికారంలో ఉన్న సమయంలోనే వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరు చర్చకు దారితీయగా ప్రస్తుతం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న పరిస్థితుల్లోనూ విభేదాలు కొనసాగుతుండటం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. వీరిద్దరి మధ్య గ్యాబ్ పై గతంలో అనేక గుసగుసలు వినిపించాయి. తాతా మధు ఎమ్మెల్సీగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పువ్వాడ వర్గంతో దూరం మరింత పెరిగిందన్న చర్చ అప్పట్లోనే రాజకీయ వర్గాల్లో వినిపించింది. 2026లోనూ ఖమ్మం బీఆర్ఎస్‌లో తాతా మధు–పువ్వాడ మధ్య గ్యాప్‌పై చర్చ కొనసాగుతోందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. తాజాగా ఓ జర్నలిస్టు తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఇరువురు నేతలు వచ్చిన సందర్భంలో వారి మధ్య ఉన్న రాజకీయ దూరం మరోసారి స్పష్టమైందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకే సందర్భంలో ఎదురుపడినప్పటికీ ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరించడం పార్టీ శ్రేణుల దృష్టిని ఆకర్షించింది.ఇప్పటికే కొనసాగుతున్న అంతర్గత విభేదాలకు ఈ పరిణామం మరింత బలం చేకూర్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ, వారి రాజకీయ కార్యకలాపాలు, అనుచర వర్గాల వ్యవహారశైలి మాత్రం వేర్వేరుగా కనిపిస్తోందని కేడర్‌లో చర్చ జరుగుతోంది.జిల్లా పార్టీ అధ్యక్షుడిగా తనదైన శైలిలో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు తాతా మధు ప్రయత్నిస్తున్నారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కూడా ఖమ్మం నియోజకవర్గంలో తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఎవరి రాజకీయ బలం వారిదే అన్నట్లుగా రెండు వర్గాలు ముందుకు సాగుతున్నాయనే చర్చ మొదలైంది.ఇదే క్రమంలో మాజీ కార్పొరేటర్‌ను ఉద్దేశించి తాతా మధు చేసిన వ్యాఖ్యలపై రాజకీయంగా చర్చ జరగగా అందుకు అవతలి వర్గం నుంచి కూడా అదే స్థాయిలో స్పందన రావడం వర్గ విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పకనే చెబుతోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. నేతల మధ్య నెలకొన్న ఈ పరిస్థితి క్రమంగా కింది స్థాయి నాయకులు, కార్యకర్తల మధ్య కూడా ప్రతిబింబిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వర్గానికి మద్దతుగా నిలిస్తే మరో వర్గం నుంచి వ్యతిరేకత వస్తుందేమోనన్న ఆందోళన కొంతమంది కేడర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.జిల్లాలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నేతలు తమ తమ వర్గాలను బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజా సమస్యలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడం వంటి అంశాల కంటే వ్యక్తిగత ఆధిపత్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి.ఇప్పటికే బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉండటంతో పార్టీ శ్రేణులు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా స్థాయిలోనే రెండు వర్గాల మధ్య విభేదాలు కొనసాగితే కింది స్థాయి కేడర్ మరింత గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.ఒకే పార్టీలో ఉంటూ పరస్పరం దూరంగా ఉండటం, ఒకరి కార్యక్రమాలకు మరొకరు దూరంగా ఉండటం, అనుచర వర్గాలు పరస్పరం విమర్శలకు దిగడం వంటి పరిణామాలు కొనసాగితే దాని ప్రభావం పార్టీ సంస్థాగత వ్యవస్థపై పడే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.మరోవైపు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వర్గం మాత్రం వెనక్కి తగ్గే పరిస్థితిలో లేదన్న సంకేతాలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం నియోజకవర్గంలో తనకు ఉన్న రాజకీయ పరిచయాలు, కార్యకర్తలతో సంబంధాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారని ఆ వర్గం పేర్కొంటోంది. దీంతో తాతా మధు–పువ్వాడ మధ్య ఉన్న రాజకీయ విభేదాలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా పార్టీ జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇద్దరు కీలక నేతలు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ వారి మధ్య సమన్వయం కనిపించకపోవడం బీఆర్ఎస్ కేడర్‌లో చర్చకు దారితీస్తోంది. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు మరింత ముదరకుండా అధిష్టానం జోక్యం చేసుకుని ఇరువర్గాల మధ్య సమన్వయం తీసుకురావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం అందరి దృష్టి మాత్రం తాతా మధు–పువ్వాడ అజయ్ మధ్య నెలకొన్న ఈ రాజకీయ దూరం ఎటు దారితీస్తుందన్నదానిపైనే ఉంది. విభేదాలకు తెరదించి పార్టీ కోసం ఇద్దరూ కలిసి పనిచేస్తారా లేక ఆధిపత్య పోరు మరింత ముదురుతుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

కలియుగ దైవం, ఖమ్మం కి అభయం

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్య అనుగ్రహంతో ఖమ్మం నగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఖమ్మం జిల్లా ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్టమైన ఘట్టంగా నిలవనుంది. ఖమ్మం నగర ప్రజల చిరకాల ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఈ ఆలయ నిర్మాణ కార్యక్రమం ముందుకు సాగడం ఎంతో సంతోషకరమైన విషయం. తిరుమల తిరుపతి దేవస్థానం వంటి ప్రతిష్ఠాత్మక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం నిర్మితమవుతుండటం ఖమ్మం నగరానికి లభించిన ప్రత్యేక గౌరవంగా భావించవచ్చు.శ్రీవేంకటేశ్వర స్వామివారు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం. తిరుమల క్షేత్రానికి వెళ్లి శ్రీవారిని దర్శించుకోవడం ప్రతి భక్తుడి జీవితంలో ఒక పవిత్రమైన అనుభూతి. అదే దివ్య సన్నిధిని ఖమ్మం నగరంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత భక్తులకు శ్రీవారి దర్శనం మరింత చేరువ కానుంది.ఈ ఆలయం భవిష్యత్తులో కేవలం పూజా కార్యక్రమాలకు పరిమితం కాకుండా వైదిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందేలా దోహదపడనుంది. పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాలు, వైదిక కార్యక్రమాల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించే పవిత్ర క్షేత్రంగా రూపుదిద్దుకోనుంది.ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ఈ ఆలయం ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక గమ్యస్థానంగా మారనుంది. తద్వారా ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత మరింత పెరగనుంది.ఈ బృహత్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సహకరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి సహకరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు.తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్. నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు.ఈ పవిత్ర వైదిక కార్యక్రమానికి ఆధ్వర్యం వహిస్తున్న శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామివారి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఈ కార్యక్రమానికి విశిష్టతను చేకూరుస్తోంది. ఖమ్మం నగరంలో శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తై, భక్తులకు స్వామివారి దర్శనం అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను.12 అక్టోబర్ 2026 ఉదయం 9.30 నిముషాలకు జరిగే భూమిపూజ మహోత్సవ పవిత్ర కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, శ్రీవారి భక్తులు అందరూ తమ కుటుంబ సమేతంగా పాల్గొని, ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకను విజయవంతం చేసి శ్రీవారి కృపకు పాత్రులు కావాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాను."వేంకటాద్రి సమం స్థానంబ్రహ్మాండే నాస్తి కించన।వేంకటేశ సమో దేవోన భూతో న భవిష్యతి॥"శ్రీవారి దివ్య కృపాకటాక్షాలతో ఖమ్మం నగరం మరింత ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకోవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని అభిలషిస్తూ...మీ తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర మంత్రి.

ఆర్‌బీపీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 8 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం లోని అంగడిపేట ఆ ంజ నేయ స్వామి ఆలయం వద్ద అ మావాస్య సందర్భంగా వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖ ర్– స్రవ ంతి దంపతులు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, గజ్వేల్ కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ది బిక్షపతి మాట్లాడుతూ పితృపక్షాల సందర్భంగా దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రావికంటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో ముందుండి తమ వంతు సహకారం అందిస్తున్న దాతలకు, వారి కుటుంబ సభ్యులకు దేవదేవతల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. "అన్నదానం మహాదానం" అని పేర్కొన్నారు.అనంతరం రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అన్నారు. పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో తన కుటుంబానికి సేవ చేసే అవకాశం కల్పించిన వాసవి సేవా సమితి కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, లయన్ దొంతుల సత్యనారాయణ, నేతి సంతోష్, కైలాస ప్రశాంత్, గందే సంతోష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చత్తీస్గఢ్లో ఐఈడి బాంబు పేలి ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు జవాన్లకు గాయాలు

ఉద్యమపోరు, చింతూరు, అక్టోబర్ 08 : ఛత్తీస్ గఢ్ లోని సుక్మా జిల్లాలో ఏలదమగు క్యాంప్ సమీపంలో ఐఈడీని నిర్వీర్యం చేస్తుండగా శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ పేలుడులో నలుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం, గాయపడిన వారందరినీ కొంటా లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు నిర్వహించిన అనంతరం తెల ంగాణ లోని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందిన సమాచారం ప్రకారం భద్రతా దళాల బృందం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతున్న స మ య ంలో, సైనికులు ఒక ఐఈడీని కనుగొని దానిని నిర్వీర్యం చేయడం ప్రారంభించారు. ఐఈడీని నిర్వీర్యం చేస్తుండగా, అకస్మాత్తుగా శక్తివంతమైన పేలుడు సంభవించి, నలుగురు సైనికులు గాయపడ్డారు.గాయపడిన సైనికులు సిఆర్పిఎఫ్ 50వ బెటాలియన్కు చెందిన వారని చెబుతున్నారు. ఈ ఘటన నేపథ్యంలో, భద్రతా దళాలు ఆ ప్రాంతంలో నిఘాను పెంచాయి. చుట్టుపక్కల ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఐఈడీ పేలుడులో గాయపడ్డ ఏఎస్సై ఎం.కె. తివారీ (ఏటీటీ జట్టు) – తీవ్రమైన గాయం అయ్యింది.మరో ఏఎస్ఐ అనీష్ ఖాన్ (50 బెటాలియన్, సీఆర్పీఎఫ్) – తీవ్రంగా గాయపడ్డారు. ఇన్స్పెక్టర్ అమర్నాథ్ మిశ్రా (ఏటిటి టీమ్) కు సాధారణ గాయాలయ్యాయి.మరో జవాన్ పి.ఆర్. కుల్దీప్ రాజ్ (50వ బెటాలియన్, సి.ఆర్.పి.ఎఫ్.) స్వల్ప గాయాలు. ఈ సంఘటన అనంతరం ఆ ప్రాంతమంతా విస్తృతంగా కుంబింగ్ నిర్వహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా న్యాయవాదుల రాస్తారోకో

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఖమ్మం కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, అక్రమ అరెస్టులను ఖండించాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "బీజేపీ డౌన్ డౌన్" జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది స్వామి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎంపీపై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షికత ఉండాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసే విధంగా ఎన్నికల సంఘం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.న్యాయవాదులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల అనుసరిస్తున్న విధానాలను పునఃపరిశీలించాలని, తెలంగాణ ప్రజల హక్కులు, ప్రయోజనాలను గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాలని కోరారు. ప్రజా సమస్యలపై న్యాయవాదులు ప్రజల తరఫున తమ గళాన్ని నిరంతరం వినిపిస్తారని పేర్కొన్నారు.ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి కార్యక్రమంలో పాల్గొని న్యాయవాదుల నిరసనకు మద్దతు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవాదులు తమ వంతు బాధ్యతగా నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదులు బత్తుల బసవపున్నయ్య, కర్లపూడి శ్రీనివాసరావు, వై.వి. శ్రీనివాస్ నాయుడు, సింగం జనార్ధన్, కాసర రాజశేఖర్ రెడ్డి, హేమంత్ కుమార్, ఆకుల శేఖర్, ఎస్వీ రమణ, ఆర్ ఎల్ ఎన్ శాస్త్రి, పాములు దానయ్య చంద్రశేఖర్ గుప్తా, డోన్వాన్ వెంకియ్య, డి .రాము, పంబ నాగేశ్వరరావు, పి. పాపారావు, చంద్రశేఖర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. మహిళా న్యాయవాదులు వూట్కూరి విజయలక్ష్మి , ప్రవళిక, అనుష తదితరులు కూడా పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

ఖమ్మంలో భూములు, మట్టి, బెరైటీస్ దోపిడీకి పాల్పడేది కాంగ్రెస్ నేతలే...?

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 08 : ఖమ్మం జిల్లావ్యాప్తంగా భూములు, మట్టి, బెరైటీస్ వంటి సహజ వనరుల దోపిడీకి కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. నగరంలోని ఆయన నివాసంలో గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహకం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు గిరిజనుల భూములను కబ్జా చేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని, మట్టి, బెరైటీస్ వంటి వనరులను అక్రమంగా తవ్వి తరలిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ కార్యకలాపాల ద్వారా వందల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. ఖమ్మంలో కాంగ్రెస్ నేతలు సాగిస్తున్నారని ఆరోపిస్తున్న అక్రమ కార్యకలాపాలపై ప్రజలు దృష్టి సారిస్తున్నారని, తమ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ ఏమి కోల్పోతున్నామో ఆలోచిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు నాంది అని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ సాధించే విజయం రాష్ట్రంలో సరికొత్త రాజకీయ ట్రెండ్‌కు శ్రీకారం చుడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఇన్ ఛార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పాల్గొన్నారు.

సీతారామ, సత్తుపల్లి ట్రంక్ పనులకు వేగం

- **భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి**
- **రైతులకు పరిహారం అందించాలి**
- **నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ**
- **ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు**
- **పలు మండలాలకు తాగునీటి భరోసా**

ఉద్యమపోరు, హైదరాబాద్, అక్టోబర్ 08 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల భూములను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి, ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– సత్తుపల్లి ట్రంక్ పనులపైనా దృష్టి

సత్తుపల్లి ట్రంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని మంత్రి తుమ్మల ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు.

– రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు

వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తుమ్మల పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనుల పురోగతిపై చర్చించారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడం, భూసేకరణ సమస్యలను పరిష్కరించడం కీలకమని ఈ సందర్భంగా స్పష్టమైంది. సీతారామ ఎత్తిపోతల పథకం సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు తాగునీటి అవసరాలకూ భరోసా లభించనుంది. ఈ నేపథ్యంలో పనుల వేగవంతం, భూసేకరణ పరిష్కారం, రైతులకు పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం అక్టోబర్ 8 : ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని బయలుదేరుతున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని తన కూతురు లాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయతతో మాట్లాడితే సంస్కారం లేని నాయకులు ఎమ్మెల్యే పైన సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు.దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శ చేస్తే హుందాగా ఉండాలని ఇట్లా ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు ప్రతీ మహిళను తన తల్లిలా చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అత్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు కుళ్ళుతో విమర్శించడానికి ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచిదికాదని మరోసారి ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయకుండా కఠినంగా శిక్షించాలని అన్నారు.

కరెంట్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

- **24 గంటల విద్యుత్ హామీ ఏమైంది?**
- **కెరెళ్లిలో గంటన్నర పాటు రైతుల ధర్నా**

ఉద్యమపోరు, వికారాబాద్ 08 అక్టోబర్ : మండలం కెరెళ్లి గ్రామంలో విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపిస్తూ గ్రామంలోని ప్రధాన రహదారిపై సుమారు గంటన్నర పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు.పంటలకు నీరు అందించాల్సిన కీలక సమయంలో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తే వ్యవసాయం ఎలా సాగించాలని రైతులు ప్రశ్నించారు. 24 గంటల విద్యుత్ సరఫరా హామీ ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలతో పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు తెలిపారు. సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి, విద్యుత్ సరఫరాపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కరెంట్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

ఉద్యమపోరు, వికారాబాద్, అక్టోబర్ 08 : మండలం కెరెళ్లి గ్రామంలో విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపిస్తూ గ్రామంలోని ప్రధాన రహదారిపై సుమారు గంటన్నర పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు.పంటలకు నీరు అందించాల్సిన కీలక సమయంలో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తే వ్యవసాయం ఎలా సాగించాలని రైతులు ప్రశ్నించారు. 24 గంటల విద్యుత్ సరఫరా హామీ ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలతో పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు తెలిపారు. సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి, విద్యుత్ సరఫరాపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బతుకమ్మ ఆటపాటలతో అలరించిన గురుకుల కళాశాల విద్యార్థినులు

ఉద్యమపోరు, శామీర్ పేట , అక్టోబర్ 8 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట శామీర్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపక బృందం రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇషత్ మాట్లాడుతూ తెలంగాణ పండుగైన బతుకమ్మను విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ జి. ధనవేణి మాట్లాడుతూ బతుకమ్మ ఆటలోని లయ, బతుకమ్మ పాటల్లోని గొప్పతనం, తెలంగాణ మహిళల జీవన విధానంతో ముడిపడిన సాంస్కృతిక విశిష్టతను వివరించారు. విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. స్రవంతి, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ ఎం. గీత, కల్చరల్ కోఆర్డినేటర్లు జి. ధనవేణి, మమత, అధ్యాపకులు, విద్యార్థినులు

కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ఉద్యమపోరు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08 : సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల పరిసరాలను,వంట గది,స్టోర్ రూమ్,తరగతి గదులను పరిశీలించారు.పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థినులు విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు.వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది,విద్యార్థినుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో అమలు చేస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు.పలువురు సిబ్బంది అటెండెన్స్ నమోదు వివరాలలో తేడాలు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.హాజరులో లోపాలు ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.టాయిలెట్లు,ఫ్లోరింగ్ తదితర నిర్మాణాల పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులను ప్రశ్నించారు.కస్తూర్బా విద్యాలయాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని,తక్షణమే పనులు చేపట్టి నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి,మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.నాసిరకం బియ్యం,సరుకులు కేటాయిస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్,మరమ్మత్తులు చేయించాలని,వీలుపడని పక్షంలో కొత్త ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు.పాఠశాల ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, తాను వారం పది రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు.సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని మండల అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ రవీందర్,ఎంపీడీఓ ఆరీఫ్ అహ్మద్,ఎంఈఓ రాములు,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

గుర్రంపోడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ఉద్యమపోరు, గుర్రంపోడు, అక్టోబర్ 08 నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము శ్రీనివాస్ మరియు మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యే జై వీర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు ఒకరికొకరు పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకొని సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భవిష్యత్తులో ఉన్నతమైన పదవులను అధిరోహించి నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు,సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరం

ఉద్యమపోరు, కల్లూరు, అక్టోబర్ 08 : వెన్నవల్లి గుట్టలో మట్టి తరలింపు వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది. స్థానికుల కథనం ప్రకారం గత 30 సంవత్సరాలుగా గుట్టలోని మట్టిని జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ కొందరు ఆర్థికంగా లాభపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక తరం తర్వాత మరో తరం ఈ మట్టి తరలింపు కొనసాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఇటీవల మరికొందరు కూడా ఈ మట్టి తరలింపు వ్యవహారంలోకి ప్రవేశించి గుట్టలోని మట్టిని పెద్ద ఎత్తున తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో భవిష్యత్తులో వెన్నవల్లి గుట్ట అసలు రూపాన్నీ కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మట్టితో పాటు సమస్యలూ తరలింపుగుట్ట నుంచి భారీ వాహనాల్లో మట్టి తరలించడం వల్ల పరిసర ప్రాంతాల్లో దుమ్ము విపరీతంగా వ్యాపిస్తోందని రైతులు చెబుతున్నారు. దుమ్ము కారణంగా సమీపంలోని పంటలకు నష్టం కలుగుతోందని, జేసీబీలు మరియు భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని స్థానికులు అంటున్నారు.అధిక లోడుతో వెళ్లే వాహనాల కారణంగా రోడ్లు దెబ్బతిని, సాధారణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు, ద్విచక్రవాహన దారులు, ఇతర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదు?గుట్ట నుంచీ పెద్ద ఎత్తున మట్టి బయటకు వెళ్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు నిరంతర పర్యవేక్షణ చేయడం లేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.మట్టి తరలింపునకు ఎవరు అనుమతి ఇచ్చారు?ఎంత పరిమాణంలో మట్టి తరలించేందుకు అనుమతి ఉంది?అనుమతులు ఏ భూములకు, ఏ ప్రాంతానికి వర్తిస్తున్నాయి?పర్యావరణ, రహదారి, పంటలు, ప్రజలు మరియు పశువుల భద్రతకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా?అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు?అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ముడుపుల ఆరోపణలపై విచారణ జరగాలికొంతమంది స్థానికులు “అధికారుల మౌనం వెనుక ఏమైనా ప్రయోజనాలు లేదా ముడుపుల వ్యవహారం ఉందా?” అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు ప్రస్తుతం ఆధారాలు బయటపడలేదు. అందువల్ల ఈ అంశంపై ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.కళ్లముందే కనిపిస్తున్నా కేసులు ఎందుకు లేవు?భారీ వాహనాల్లో మట్టి తరలింపు జరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు లేదా వ్యక్తులపై కేసులు నమోదు చేశారా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నట్లయితే సంబంధిత రవాణా, రెవెన్యూ, మైనింగ్, పోలీస్, పంచాయతీ శాఖలు తమ పరిధిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.గుట్టను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?వెన్నవల్లి గుట్ట కేవలం మట్టి నిల్వ ఉన్న ప్రాంతం కాదని, దాని చుట్టూ వ్యవసాయ భూములు, పశువులు, ప్రజల జీవనాధారం ఉందని స్థానికులు చెబుతున్నారు. మట్టి తరలింపుతో గుట్టలో భారీ గుంతలు ఏర్పడితే భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డబ్బు సంపాదన కోసం గుట్ట స్వరూపం మారిపోతుంటే చూస్తూ ఊరుకోవాలా?ప్రజలు, పశువులు, పంటలు, రహదారులపై ప్రభావం పడుతున్నా అధికారులు మౌనంగా ఉండటానికి కారణమేంటి?అనే ప్రశ్నలు ఇప్పుడు వెన్నవల్లి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారాయి.సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్వెన్నవల్లి గుట్టలో గతంలో ఎన్ని సంవత్సరాలుగా మట్టి తరలింపు జరిగింది, ఎవరెవరికి అనుమతులు ఉన్నాయి, ఎంత పరిమాణంలో మట్టి తరలించారు, ఏ శాఖలు అనుమతులు ఇచ్చాయి, ప్రభుత్వానికి ఏ మేరకు రుసుములు చెల్లించారు, నిబంధనలు ఉల్లంఘించారా అనే అంశాలపై సమగ్ర అధికారిక విచారణ నిర్వహించి నివేదికను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే గుట్ట ప్రాంతాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి, అక్రమంగా తవ్వకాలు లేదా అనుమతులకు మించి మట్టి తరలింపు జరుగుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.వెన్నవల్లి గుట్టపై మౌనం వీడేది ఎప్పుడు?మట్టి తరలింపు వెనుక అసలు వాస్తవాలు బయటకు వచ్చేది ఎప్పుడు?ప్రజల ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇస్తారా?అనేది ఇప్పుడు వేచి చూడాల్సిన అంశంగా మారింది.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com